





హైదరాబాద్ వార్త


ప్రయాణం కన్నా..

# పార్కింగ్ ఫీజే ఎక్కువ

**మెట్రో స్టేషన్లలో పార్కింగ్ ఛార్జీల మోత**

**గంటకు రూ.10చెల్లించినా వాహనాలకు భద్రత కరువు**

**ఫీజు సవరించాలని ప్రయాణికుల డిమాండ్**



హైదరాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త: ట్రాఫిక్ సమస్యరోజురోజుకు పెరుగుతున్న నగరంలో ప్రజలకు మెరుగైన ఆధునిక రవాణా వ్యవస్థ మెట్రోను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం మెట్రో స్టేషన్లలో వాహనాలు పార్కింగ్ బాదుడును అదుపు చేయలపోకపోతుందనే చర్చ జరుగుతుంది. నగరంలోని మూడు మెట్రో కారిడార్‌లలో మొత్తం 56 మెట్రో స్టేషన్‌లు ఉండగా వీటిలో రెండు మినహా మిగిలిన అన్ని స్టేషన్లలో మెట్రో అధికారులు ద్విచక్రవాహనాలకు పెయిడ్ పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ద్విచక్రవాహనానికి గంటకు రూ.10 ఛార్జీలు వసూలు చేస్తున్నారు. అలాగే నాలుగు గంటలక ఆపై పార్కింగ్ చేస్తే 25-50వరకు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్, హైటెక్‌సిటీ, మియాపూర్, సికింద్రాబాద్ తదితర మెట్రో అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎక్కవ మంది తమ ద్విచక్రవాహనాలపై మెట్రో స్టేషన్‌కు వచ్చి అక్కడ వీటిని పార్కింగ్ చేసి అక్కడి నుంచి తమ గమ్యస్థానాలు మెట్రో రైల్‌లోప్రయాణిస్తున్నారు. కానీ ఉదయం వారు పార్కింగ్ చేసి వెళ్లి పోయిన తర్వాత సాయంత్రం తిరిగి వచ్చి ద్విచక్రవాహనం తీసుకుంటే దాదాపు ఏడు నుంచి ఎనిమిది గంటల సమయం పడుతుంది. ఎనిమిది గంటలకు రూ.50పార్కింగ్ ఫీజు చెల్లిస్తున్నారు. ఇదే మెట్రోరైల్‌లో ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు ప్రయాణిస్తే కూడా రూ.40 ఖర్చవుతుంది. కొన్నిసార్లు తిరుగుప్రయాణం ఆలస్యం అయితే సుమారు పదిగంటల పార్కింగ్ ఛార్జీలను రూ.60వరకు చెల్లించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. రూ.40, పార్కింగ్ 50 కలిపి మెట్రోకు మొత్తం 90 చెల్లించాల్సి వస్తుందంటున్నారు. మెట్రో స్టేషన్ల వరకు పరిసర ప్రాంతాల నుంచి ఇంకా పూర్తి స్థాయిలో ఫీడర్ వాహనాలు అందుబాటులో లేనందున, అవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే వరకు ఈపార్కింగ్ ఛార్జీలను తగ్గించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కూకట్‌పల్లి, అమీర్‌పేట్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోని మెట్రో స్టేషన్లలో రోడ్డుకు ఇరువైపులా జిహెచ్‌ఎంసీ రోడ్లను వినియోగిస్తూ, మెట్రో రైలు అధికారులు పెయిడ్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయటాన్ని ప్రయాణికులు తప్పుపడుతున్నారు. అలాగే వాహనాన్ని పార్కింగ్ చేసి రైలు ఎక్కి వెళ్లిన తర్వాత మధ్యలో ఏదైనా అర్జెంట్ పనిబడితే వాహనాన్ని బయటకు తీసేందుకు వీల్లేకుండా అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేసి ఉంచుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా వాహనాల మధ్య ఇరుక్కుపోయి వాహనాన్ని బయటకు తీసేందుకు అక్కడున్న సిబ్బంది మాత్రం వాహనదారులకు ఏమాత్రం సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో తాము తిరిగొచ్చే సరికి బైక్‌ల ప్లగ్‌లు మాయం చేయడం, టైర్లలో గాలి తీసేయడం వంటికి కూడా చేస్తుండటంతో స్టేషన్లలో వాహనాలను పార్కింగ్ చేసేందుకు జంకుతున్నారు.

## సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి: లింబాద్రి

సైఫాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త: నేటి సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు సాగుతూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం రవీంద్రభారతిలో నిజాం కళాశాల ద్వీతీయ గ్రాడ్యేయేషన్ డే జరిగింది. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నిజాం కళాశాలకు నాటినుంచి నేటి వరకు కీర్తి ప్రతిష్టలు వచ్చాయని, వీటిని ముందుకు తీసుకుపోవాలని సూచించారు. నేటి సమాజంలో సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ వాడకం సవాలుగా మారిందని వీటికి దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ మాట్లాడుతూ విద్యా, పరిశోధన ప్రమాణాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ క్రమంలోనే 2022 సంవత్సరానికి ఓయూలో జాతీయ స్థాయిలో 22వ ర్యాంక్ దక్కిందని, అలాగే పిజి కోర్సుల క్రిడిట్ విధానంలో మార్పులు, పరిశోధనలు చేసేందుకు అధ్యాపకులను ప్రోత్సహిస్తూ వైస్-ఛాన్సలర్ అవార్డును ప్రవేశపెట్టామని చెప్పారు. నిజాం కళాశాల ప్రగతి నివేదికను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. బీమా సమర్పించారు. అనంతరం బిఏ, బికాం, బిఎస్సీ, బిసిఏ, బిబిఏ, తదితర యూసి కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు బంగారు పతకాలను వారు ప్రదానం చేశారు.

## అఫిడవిట్ సమర్పించడానికి ప్రభుత్వం ముందుకు రావడం శుభసూచకం

సైఫాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014లో బిసిల జాబితా నుంచి తొలగించిన 26 కులాల నుంచి ప్రాతినిధ్యాలు, అభ్యంతరాలను సమర్పించడానికి నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 బిసి కుల సంఘాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సహాయ సహకారాలతో గత 8 ఏళ్ళుగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు సుధీర్ఘమైన పోరాటాలు నిర్వహించామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిసి కమిషన్‌కు అనేక ప్రాతినిధ్యాలను సమర్పించామని దీని ఫలితంగానే తొలగించబడిన 26 కులాల స్థితిగతులను విధిగా ధృవీకరించిన తరువాత సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం శుభసూచికమన్నారు. ఒక నేలలో సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి అభ్యంతరాలు లేకుండా తొలగించిన మొత్తం 26 కులాలను తిరిగి బిసి జాబితాలో చేర్చడానికి ఉత్తర్వులు జారీ చేస్తుందని తాము గట్టిగా నమ్ముతున్నామని ఆయన స్పష్టం చేశారు. తమకు సహకరించిన అన్ని బిసి సంఘాలు, రాజకీయ పార్టీలకు ఆళ్ల రామకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

ఫొటో స్టూడియోలో

## చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త : షట్టర్ పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బుధవారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఏసిపి నరేష్‌రెడ్డి, సిఐ ఆర్.గోవిందరెడ్డి, క్రైం సిఐ సి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఎండోమెంట్ కాలనీలో నివసించే సాయిచిత్రనగర్‌లోని మానస పోటో స్టూడియోలో గత అక్టోబర్ 25వ తేదీన టంటం రామకృష్ణకు చెందిన పోటో స్టూడియోలో తాళం వేసి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఐ వెంకటేశ్వర్లు దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఒడిస్సాకు చెందిన అమిత్‌కుమార్ స్వైన్ 20 రామంతాపూర్ సాయిచిత్రనగర్‌కు వచ్చి ప్లంబర్‌గా పనిచేస్తూ చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. రాత్రి వేళ తిరుగుతూ తాళం వేసిన షట్టర్ పగులగొట్టి చోరీలు చేసినట్లు తెలిపారు. అతనిని అదుపులోకి తీసు కుని ప్రశ్నించగా చోరీ వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో ఒడిస్సా కబిసూర్య నగర్ పిఎస్‌లో నాలుగు కేసులు, ఉప్పల్ పిఎస్‌లో మూడు కేసులు ఉన్నాయని తెలిపారు. వీరి వద్ద నుంచి రెండు కెమెరాలు, లెన్స్, ప్లాష్ లైట్లు, చార్జర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.మూడున్నర లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి సబితా



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టి పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని అర్హులైన ప్రతిఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ తహసిల్ తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ మానసపుత్రిక కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం అని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 6వేలకు పైచిలుకు లబ్ధిదారులకు రూ.7.39కోట్ల కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అడబిడ్డల పెళ్ళిళ్ళకు ప్రభుత్వ సహాయం అందించామన్నారు. ఎవరి ప్రమేయం లేకుండా, పైరవిలకు తావు లేకుండా నేరుగా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. కేసీఆర్ కిట్, మహిళల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఎగ్గే మల్లేశంకురుమ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, ఆర్డిఓ సూరజ్, తహసిల్దార్ జయశ్రీ, లోకసాని కొండల్‌రెడ్డి, పెండ్యాల నగేష్, ఎస్‌కె. మొహమ్మద్ పాల్గొన్నారు.

## చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

**ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు**



విధ్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న టిటిఐ ఇన్స్‌పెక్టర్ నాగరాజు

బేగంపేట నవంబరు 30,ప్రభాత వార్త : ట్రాఫిక్ నిబంధనలపై చిన్న నాటి నుంచే విధ్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఇన్స్ పెక్టర్ నాగరాజు పిలుపు నిచ్చారు. నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యల గురించి విధ్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నాగరాజు సూచించారు. బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై విధ్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమం మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింహ ఆధ్వర్యంలో సెయింట్ ఆంథోని పాఠశాలకు చెందిన 8,9,10 తరగతుల కు చెందిన విద్యార్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంట నగరాల పరిధిలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న జాగ్రత్త చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రతి చిన్నారి వారి తల్లి దండ్రులకు ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం, బాధ్యత విద్యార్థులపైన కూడా ఉంటుందన్నారు. తమ తల్లి దండ్రులు ద్విచక్ర వాహనం పై విధ్యా ర్థులను పాఠశాలకు తీసుకు వస్తున్న సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాల న్నారు. అలాగే కార్లలో అయితే తప్పక సీటు బెల్లు ధరించాలన్నారు. రాంగ్‌రూట్లో ప్రయాణించవద్దని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, సిగ్నల్స్ జంపింగ్ చేయవద్దన్నారు. ప్రతి తల్లి దండ్రి ట్రాఫిక్ నిబంధనలు పాటించి నట్లైతే తమ చిన్నారుల ను భద్రతగా భరోసాగా ఎక్కడికైనా తీసికెళ్ల వచ్చున్నారు. చిన్నతనం నుంచే జంట నగరాల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ట్రాఫిక్ నిబంధనలు చిన్నారులు (విధ్యార్థులు) తెలుసుకున్నట్లైతే వారి కుటుంబాలను వారు మార్చుకుంటారని, దీంతో ప్రమాదాల నివారణకు చక్కని మార్గం సుగమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింహ, ఎస్సై జ్యోతి పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు నిజాం కళాశాల హాస్టల్‌లో డిగ్రీ అమ్మాయిలు



**నిజాం కళాశాల**

**అమ్మాయిల హాస్టల్‌ను సందర్శించిన ఓయూ వైస్‌చాన్సలర్**

సైఫాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త: నిజాం కళాశాల యాజమాన్యం అమ్మాయిల కోసం నిర్మించిన హాస్టల్‌లో ఎట్టకేలకు డిగ్రీ విద్యార్థులు హాస్టల్ చేరారు. బుధవారం హాస్టల్‌ను ఓయూ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా హాస్టల్‌ను సందర్శించారు. 284 మంది విద్యార్థులకు ఈ హాస్టల్‌లో వసతి సౌకర్యం ఉంది. ప్రస్తుతం 198 మంది విద్యార్థినీలు దరఖాస్తు చేసుకుని వసతి సౌకర్యం పొందుతున్నారు. ఈ హాస్టల్ విషయంలో పెద్ద ఎత్తున ఉద్యమమే కొనసాగింది. డిగ్రీ విద్యార్థులకు ఈ హాస్టల్‌లో వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. కాని పిజి విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తామని వైస్-ఛాన్సలర్ ఆదేశాలు జారీ చేయడంతో డిగ్రీ విద్యార్థులు ఉద్యమం చేపట్టవలసి వచ్చింది. చివరికి రాష్ట్ర మంత్రులు కెటిఆర్, సబితాఇంద్రారెడ్డి జోక్యంతో డిగ్రీ విద్యార్థులకు హాస్టల్‌లో వసతి సౌకర్యం లభించింది.

## 14 నుంచి నివధికంగా హామాలీలు సమ్మె

సైఫాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సివిల్ సప్లయీస్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న హామాలీ కార్మికులకు గత ఒప్పందం ప్రకారం హామాలీ రేట్లు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 14వ తేదీ నుంచి నిరవధికసమ్మెకు వెళతారని రాష్ట్ర సివిల్ సప్లయీస్ హామాలీ యూనియన్ హెచ్చరించింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 182 మండల పాయింట్ గోడౌన్‌లలో వేలాది మంది సమ్మె చేస్తారని డిసెంబరు 12న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా చేసి కలెక్టర్‌లకు వినతి పత్రాలు సమర్పిస్తారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్పారు. ఈ మేరకు జనరల్ బాడి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన తెలిపారు. గత 11 నెలల నుంచి హామీల రేట్లు పెంచాలని ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేశామని, అలాగే ధర్నాలు చేపట్టామని, అఖరికి సివిల్ సప్లయీస్ కార్యాలయాన్ని ముట్టడించిన ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే హామాలీల రేట్లు పెంచి జివో విడుదల చేయాలని ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు.

## అద్భుతంగా సాగిన తెలుగు హిందీ మధుర గీతాల సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త: సప్తస్వర మాలిక సాంస్కృతిక సంస్థ అధినేత, మధుర గాయకుడు నల్లమిల్లి నిర్వహణలో నిర్వహించిన తెలుగు హిందీ మధుర గీతాల సినీ సంగీత విభావరి కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారి గాయనీ ధాత్రి సుందర్ తన గానంతో అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు కళ్లేపల్లి మోహన్, శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, రవిశంకర్, ఉదయ్‌భాస్కర్, రమేశ్‌కుమార్, కిట్ల శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, సంతోష్ మాచర్ల, రాజేంద్రప్రసాద్, జి.రాజు, వరప్రసాద్ బాలినేని, అనంతకృష్ణ శర్మ, వి.ఎ.లక్ష్మి, ఉమా రామగోపాల్, సుజారమణ, శ్యామల, సావిత్రి ప్రభాకర్, లక్ష్మీభారతి, రాణి శ్రీరామ్, రమాదేవి, సుజనాశర్మ తదితరులు అద్భుతంగా గానం చేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా రమణారావు వ్యవహరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో చిన్నారి గాయనీ ధాత్రి సుందర్ తల్లిదండ్రులు మధు, శివ పాల్గొన్నారు.

## ‘తూకం’ తప్పుతోంది

**వేబ్రిడ్జ్ నిర్వాహకులపై కొరవడిన నిఘా**

**తప్పుడు బిల్లులతో వ్యాపారుల దోపిడీ**

**నామమాత్రపు దాడులతోనే సరిపెడుతున్న అధికారులు**



హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త: నగరంలో వేబ్రిడ్జ్ నిర్వాహకుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. నిర్వాహకులే చేతివాటం ప్రదర్శిచి తప్పుడుతూకాలతో వ్యాపారులను, వినియోగదారులు మోసం చేస్తున్నారు. వేబ్రిడ్జీలను పర్యవేక్షించాల్సిన తూనికల, కొలతల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో వేబ్రిడ్జిల నిర్వాహకులు చేతివాటానికి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఇటీవల గృహ నిర్మాణ పనులు జోరుగా సాగుతుండటంతో ఇసుక వ్యాపారం బాగా పెరిగిపోయింది. దీంతో ఇసుక వ్యాపారులు వేబ్రిడ్జ్ నిర్వాహ కులు కుమ్మక్కై వినియోగదాలును మోసం చేస్తున్నారు. తప్పుడు బిల్లులతో మోసం చేస్తున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలలోని హైదరాబాద్-విజయవాడ నాగ్‌పూర్ వరంగల్, బెంగళూర్ ప్రధాన జాతీయ రహదారి వెంట ఉన్న వేబ్రిడ్జ్‌ల్లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆయా రహదారుల వెంట నిత్యం వందల కొద్ది ఇసుక, ఇనుము, లోడ్లు రవాణా జరుగుతోంది. వేబ్రిడ్జ్ నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకున్న వ్యాపారులు తప్పుడు తూకం బిల్లుతో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగర శివార్లలో దాదాపు 150కి పైగా వేబ్రిడ్జిలు ఉన్నాయి. గృహనిరా ్మణాలు ఊపందుకోవడంవతో నిత్యం టన్నుల కొద్ది ఇసుక, ఇనుము, క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారులు సరుకును లారీలో లోడ్‌చేసి ప్రధాన రహదారులపై ఉన్న వేబ్రిడ్జ్‌లపై తూకం వేయిస్తుం టారు. అయితే వ్యాపారులు వేబ్రిడ్జిప నిర్వాహకుల తో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఇండెక్షన్ బాక్స్‌లో ప్రదర్శించిన చేతివాటంతో కంప్యూటర్ బిల్లు లోడ్ బరువు తప్పుగా చూపిస్తుంది. ఇందుకు గాను వ్యాపారుల నుంచి కమీషన్‌రూపంలో కొంత అదనంగా వసూలు చేస్తుండటం సర్వసాధారణంగా మారింది. ప్రతి 12టైర్ల లారీ బరువు సుమారు పది టన్నులు వరకు ఉంటుంది. అందులో 21టన్నుల వరకు ఇసుక లోడ్ చేయవచ్చు. ఇసుకలోడ్ తూకం వేస్తే31 టన్నులు బరువు చూపించాలి. అదేవిధంగా 10టైర్ల లారీ బరువు సుమారు తొమ్మిది టన్నులు ఉంటుంది. అందులో 17టన్నుల వరకు ఇసుకను లోడ్‌చేయవచ్చు. తూకం వేస్తే 26టన్నులు ఉండాలి. అయితే ఈలారీలో ఇసుక తక్కువగా లోడ్ చేసినా వినియోగదారులు గుర్తించడం కష్టం. ఇసుకవ్యాపారులు చేతివాటం ఒక్కోలారి ఐదు టన్నుల వరకు తక్కువగా లోడ్‌అవుతుంది. వేబ్రిడ్జ్ నిర్వాహకుల చేతివాటంతో లేని ఐదుటన్నులు ఇసుక ఉన్నట్లుగా కంప్యూటర్ బిల్లింగ్ ద్వారా వస్తుండటంతో వినియోగదారలు మోసపోతున్నారు.

**మోసాలని ఎలా గుర్తించాలి..** వేబ్రిడ్జి పై ఇనుము, ఇసుక తదితర వాటిని తూకం వేసే ముందు కాంటా ఇండికేటర్ జీరో రీడింగ్ ఉండేలా చూడాలి. లోడ్‌లారీని తూకం వేసి రశీదు పరిశీలించాలి. ఉదాహరణకు లారీలోడ్ 14టన్నులు ఉండే వేబ్రిడ్జ్‌లో 50కిలోల 20 సెట్టింగ్(గుండ్లు) అంటే ఒక టన్ను బరువు లారీలోడ్ ఉన్న ప్లాంట్ ఫారమ్‌పై ఉంచి మరోమారు తూకం బరువు 15టన్నులు మాత్రమే ఉండాలి. కానీ లోడ్‌బరువులో హెచ్చుతగ్గులు ఉంటే మోసానికి హెచ్చరికగా గ్రహించాలి. దానిని మరో వేబ్రిడ్జ్‌లో తూకం వేసి పరిశీలిస్తే మోసం, దోపిడీ బహిర్గతమవుతుంది.

## చిదానందం కాలనీ పార్కు అభివృద్ధి చేస్తా

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన చిదానందం కాలనీ సంఘం నేతలు

సికింద్రాబాద్, నవంబర్ 30 ప్రభాతవార్త : పద్మారావునగర్‌లోని చిదానందం కాలనీలో ఉన్న పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామి ఇచ్చారు. చిదానందం కాలనీ పార్కుస్థలం కొద్దికాలంగా కోర్టు వివాదంలో ఉండడి ఇటీవలే కాలనీవాసులకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. దీంతో బుదవారం చిదానందం కాలనీ వాసులు టీఆర్‌ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవ న్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్కు అభివృద్ధి చేసి కాలనివాసులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. పార్కులో వాకింగ్ ట్రాక్, కూర్చునేందుకు అనువుగా గాజోబా నిర్మాణం, ఓపెన్ జిమ్, పచ్చదనం పెంపొందించే విధంగా మొక్కల పెంపకం చేపడతామని చెపాపరు. వెంటనే హార్టీకల్చర్, జీహెచ్‌ఎంసీ అధికారులను అవసరమైన చర్యలు తీసుకోవాలని అప్పటికప్పుడే ఫోన్‌లో ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమ లత, పద్మారావునగర్ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, హార్టీకల్చర్ అధికారులు రాఘవేందర్, డీఈ ఆంజేయులు, చిదానందం కాలనీకి వెళ్లి అభివృద్ధి పనులు చేపట్టడం కోసం పార్కు స్థలాన్ని పరిశీలించారు. వారివెంట కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, అమర్‌నాథ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోను రాణించాలి**

**సంజీవరెడ్డి నగర్..** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలోను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం సనత్‌నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే విద్యార్థుల స్పోర్ట్స్ మీట్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ పోటీలలో 50పాఠశాలలకు చెందిన వెయ్యికి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మంత్రి తలసాని విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తరగతి గదుల్లో, పరీ క్షలకు సిద్ధం కావడం వంటి వత్తిడుల నుండి విద్యార్థులకు క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. క్రమశిక్షణ కూడా అలవడుతుం దని అన్నారు. అంతేకాకుండా విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించే విధంగా పోటీలను నిర్వహించడం పట్ల రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులగా తీర్చిదిద్దడానికి ఎంతో కృషి చేస్తున్న రికగ్నైజ్డ్ స్కూల్స్ నిర్వహకులు విద్యార్థులను క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, డిప్యూటి డిఈఓ యాదయ్య, అసోసియేషన్ అధ్యక్షులు ఆగస్టీన్, జనరల్ సెక్రటరీ సుధాకర్, ఖుతుబుద్దీన్, వివిరావు, ప్రసాద్, ఉమామహేశ్వర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సహకారం: సబితారెడ్డి


సాధన చేస్తున్న వారితో కరచాలనం మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు అన్ని విధాల సహకరిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని దావూద్‌ఖాన్‌గూడలోనున్న మున్సిపల్ మైదానంలో పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను బుధవారం ఉదయం మంత్రి పలుకరించారు. మైదానాన్ని సందర్శించిన మంత్రి అందులో ఫిట్‌నెస్ సాధన చేస్తున్న యువతీ యువకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె వారికి గుడ్లు, అంబలిని పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందనీ అయితే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారికి ఊరటగా ప్రభుత్వమే ప్రతి నియోజకవర్గంలో ఒక కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామిడి రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్‌రెడ్డి, నిమ్మల నరేందర్‌గౌడ్, సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, ముత్యాల కృష్ణ, యాతం పవన్ యాదవ్, ఎరుకల రవిగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మీర్‌పేట్ నినాదంతో కార్పొరేషన్‌ను ముందుకు తీసుకెళ్ళాలి: మేయర్


స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న దుర్గ దీప్‌లాల్, విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** స్వచ్ఛ మీర్‌పేట్ నినాదంతో కార్పొరేషన్‌ను స్వచ్ఛత దిశగా ముందుకు తీసుకెళ్ళాలని మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన, శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేషన్‌లోని అన్నిడివిజన్లలో రహదారులు, వీధులు చెత్త రహితంగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల్లో చైతన్యం కోసం తీసుకోవాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మీర్‌పేట్ కార్పొరేషన్‌కు పేరు తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, డిఇఇ గోపీనాథ్, ఎఇఇ శ్రీనివాసులు, డిఎఫ్ఓ సుధీర్, టిపిఓ దేవానంద్, సానిటరీ అధికారి ఉదయ్‌సింగ్, ఆర్‌పిలు, పారిశుధ్య సూపర్‌వైజర్లు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## కోమటికుంట, పోచమ్మకుంట సుందరీరణ పనుల అక్రమాలపై కూడా స్పందించాలి: మల్లారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కోమటికుంట, పోచమ్మకుంటలకు సంబంధించిన సుందరీకరణ పనుల పేరిట జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికార టీఆర్ఎస్ పార్టీ వారు స్పందించాలని కారొ ్రేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున తాము 4 నెలల క్రితమే కుంటల సుందరీకరణ పేరిట నాణ్యతాప్రమాణాలు పాటించకుండా జరిగిన పనులకు సంబంధించి అవినీతి అక్రమాలపై ప్రశ్నించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన సంగతిని మల్లారెడ్డి గుర్తు చేశారు. వీటిపై స్పందించకుండా అధికార టీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఏ హోదాలో హెచ్ఎండిఎనుండి కుంటలసుందరీకరణకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయని ప్రచారం చేసుకుంటారని ప్రశ్నించారు. అదీ గాక బడంగ్‌పేట్ మేయర్ దృష్టిలో పెట్టకుండా మాజీ ఎంపిటిసి నిధుల గురించి ఎలా మాట్లాడతారని ఆయన అన్నారు. అల్మాస్‌గూడలో చాలా సమస్యలు ఉన్నాయనీ అదే విధంగా అసంపూర్తి అభివృద్ధి పనులు ఉన్నాయనీ వాటిని పరిష్కరించి పూర్తి చేయించే విషయంలో దృష్టి పెడితే బావుంటుందని ఆయన హితవు పలికారు.

## ఘనంగా శివనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

**వనస్థలిపురం, నవంబర్ 30 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భగా శ్రీమానసాదేవి సమేత జగత్కార శివ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో వేద పండితుల మంత్రోచ్చారణలమధ్య విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు సర్ప సూక్త హోమం, 9 గంటలకు పంచామృతాభిషేకం, 10.30గంటలకు శ్రీ మానసాదేవి జగత్కార శివ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ బుద్ధోలు అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ ఛైర్మన్లు మిట్టా రామ్మోహన్, కంచి కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.ప్రభాకర్, బాలేశ్వర్, సురేష్, సులోచన, బ్రహ్మాచారి, వనస్థలిపురం నివాసుల సంఘం అధ్యక్షుడు రేణిగుంట జగదీష్‌కుమార్‌గుప్త, కొలిశెట్టి సంజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, నవంబర్ 30 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఇంద్రనగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీవాసులు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరడంతో జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ చంద్రునాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, చందు, వీరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.72లక్షలతో ఉప్పల్ స్వరూప్‌నగర్‌లో సిసి రోడ్డు పనులు


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ స్వరూప్‌నగర్‌లో రూ.72లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్‌రెడ్డిలు ప్రారంభించారు. స్వంహప్‌నగర్‌లోఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ వరద ముంపు సమస్య ఉన్న అన్ని ప్రాంతాల్లో కొత్తగా సిసి రోడ్డు చేపడుతున్నామన్నారు. ముంపు సమస్య తప్పించేందుకు నాలాలకు పెన్సింగ్, రిటర్నింగ్‌వాల్ నిర్మాణం చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, చింతల నరసింహారెడ్డి, పంగ మహేందర్‌రెడ్డి, కృష్ణామాచారి, వేముల వెంకట్‌రెడ్డి, నాయబు వెంకటేష్, వంశీ, సందీప్‌రెడ్డి, నరేందర్, కాలనీ అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, తాటికొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాడతాం : వడ్డెర నాయకులు

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 30 ప్రభాతవార్త :** అబ్దుల్లాపూర్ మెట్ మైనింగ్ జోన్‌లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పరిస్థితిని చూస్తే ప్రభుత్వం ఒక్క గ్రామ ప్రజల కోసమే పని చేస్తున్నట్టు కనిపిస్తున్నదని 10 గ్రామాల వడ్డెరలకు అన్యాయం చేసే ప్రయత్నం జరిగే విధంగా ప్రయత్నిస్తుందని మండల వడ్డెర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ ప్రభుత్వ అధికారులు మైనింగ్ మాఫియాతో కుమ్మక్కైనట్లు అనుమానం ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను వేలమంది వడ్డెరలతో ముట్టడిస్తామని, ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు రాస్తారోకోలు, రహదారుల దిగ్బంధం చేస్తామని మండల మైనింగ్ జోన్ సాధన కమిటీ వడ్డెర సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పందిగోటి ఎల్లయ్య పల్లపు యాదగిరి, పల్లపు దాసు, రాము, ఆంజనేయులు, శ్రీను, హనుమంతు, మారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 1 నుండి 10వరకు సప్త నాటికల ప్రదర్శన పోటీలు

**వనస్థలిపురం, నవంబర్ 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రంగ స్థల కళాకారుల అభిమాన సమాఖ్య వనస్థలిపురం ఆధ్వర్యంలో డిసెంబర్ 25నుండి 28వరకు పౌరాణిక పద్య సప్తనాటికల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు పంపన వెంకటేశ్వరరావు తెలిపారు. రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య నవమి వార్షికోత్సవ సందర్భంగా ఈ నాటక పోటీలు నిర్వహిస్తున్నామని పోటీలలో పాల్గొనే కళాకారులు డిసెంబర్ 1 నుండి 10వ తేదీ వరకు దరఖాస్తులు వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలో సమాఖ్య కార్యాలయానికి పంపాల్సిందిగా ఆయన కోరారు.

## బిజెవైఎం ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కారొ ్రేషన్ బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 19, 31 డివిజన్లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి సీనియర్ నాయకుడు మంత్రి మహేష్ ముదిరాజ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడికె రవితేజ, సాయి సంతోష్, చక్రవర్తుల భువన చంద్ర, పన్నాల శ్రీకృత్‌రెడ్డి, క్యారగారి అరవింద్, విశాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చందర్‌కు రాజ్యాంగ స్ఫూర్తి అవార్డు

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌కు చెందిన బిరుదు చందర్‌కు రాజ్యాంగ స్ఫూర్తి పురుస్కారం లభించింది. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దిశ ఆధ్వర్యంలో ప్రకటించిన రాజ్యాంగ స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్య ఛైర్మన్ లింబాద్రి, తెలంగాణ ప్రెస్ అకాడెమీ ఛైర్మన్ అల్లం నారాయణ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్‌ల చేతుల మీదుగా చందర్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో గాయకునిగా పలు వేదికలపై పాటలు పాడి ప్రజలను చైతన్యపరిచినందుకు ఈ అవార్డు లభించింది.

## భక్తి శ్రద్ధలతో పాలకావడి వేడుకలు

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో శ్రీవల్లి దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పాలకావడి, సుబ్రహ్మణ్యం స్వామి షష్టి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులతో అత్యంత ప్రీతికరమైన పాలకావడితో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకాలు, అలంకరణ, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఆకుల అరవింద్‌కుమార్, అర్చకులు సాయికృష్ణ,బాలకిషన్, నవనీత్, పరమేష్, శివ, పద్మ, కావేరి, పేరష్, లాల తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు : ఎమ్మెల్యే


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని పలు కాలనీలలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు కాలనీలకు మంజూరైన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణాలకు సంబంధించి ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఎల్బీనగర్ జలమండలి జనరల్ మేనేజర్లు బలరాంరాజు, వినోద్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.4కోట్ల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైపులైన్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. చంపాపేట, మన్సూరాబాద్ డివిజన్లపరిధిలోని పలు కాలనీలలో పనులు వేగవంతంచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి మంచి నీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## రైతులకు శాపం ధరణి పోర్టల్: మేయర్ పారిజాత


ధరణి రద్దు ధర్నాలో ప్రసంగిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** తెలంగాణ రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని బడంగ్‌పేట్‌కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలో జరిగిన రైతు ధర్నాకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పక్షనా కాంగ్రెస్ నిలిచి ధరణి పోర్టల్ రద్దు అయ్యేంత వరకు పోరాడుతుందని ఆమె స్పష్టం చేవారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అనుబంధ శ్రేణులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## జాతీయ గుర్తింపుతో ప్రజలకు మెరుగైన సేవలు.. డాక్టర్ రవీంద్ర...

**కుషాయిగూడ, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఆసుపత్రులకు జాతీయ గుర్తింపు ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించగలుగుతామని ఆసుపత్రి ఛైర్మన్ ప్రముఖ వైద్యులు డాక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని సరిత డెంటల్ ఆసుపత్రికి ఎంఎ బిహెచ్ (నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ సర్టిఫికెట్ గుర్తింపువచ్చిన సందర్భంగా డాక్టర్ ఆకాష్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి అరుదైన గుర్తింపు రావడం ద్వారా ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తద్వారా ప్రపంచ స్థాయిలో అమలు జరుపుతున్న మెరుగైన మెలకువలతో కూడిన ఆధునికీకరణ పద్ధతుల ద్వారా వైద్యం అందిస్తామన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో శస్త్ర చికిత్సలు అందే విధంగా నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ ఆకాశ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సరిత సర్టిఫికెట్పై పలు వివరాలు అందజేశారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద మరమ్మత్తు పనులు : బన్నాల గీత


అంబేద్కర్ విగ్రహం వద్ద పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

**ఉప్పల్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపడుతున్న మరమ్మతు పనులను కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిచ్చెన ప్రమాదకర స్థితిలో ఉందని, అదే విధంగా పార్కు మరింత అభివృద్ధిచేసి సుందరంగా ముస్తాబు చేస్తామన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, టిఆర్ఎస్‌నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, మహుమూద్, జైభీమ్ అసోసియేషన్ నేతలు చిలుగూరి శ్రీకాంత్, తోకట నరేష్, గుండె రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహా నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**తుర్కయంజాల్, నవంబర్ 30 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామానికి చెందిన శీలం స్వామి కిడ్నీలు చెడిపోవడంతో తన తల్లి యశోద నుండి కిడ్నీ ట్రాన్‌ప్లాంటేషన్ చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఖర్చు ఎక్కువ కావడంతో ఎమ్మెల్యేను సంప్రదించడంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లక్ష రూపాయల ఎల్ఓసిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేయించి తల్లి యశోదకు అందజేసారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్దాల జ్యోతి జంగయ్య, అధ్యక్షులు బుడ్డ విజయ్‌బాబు, 4,5వవార్డ్ టిఆర్ఎస్ అధ్యక్షులు పల్లపు ఆంజనేయులు, శ్రీనివాస్‌కురుమ, నాయకులు కందాల బలదేవరెడ్డి, కందాల బిందు రంగారెడ్డి, బూర మహేష్, శీలం ప్రవీణ్, శీలం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు : డిప్యూటి కలెక్టర్


రామంతాపూర్‌లో దేవాలయ భూములను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, డిప్యూటి కలెక్టర్ రమాదేవి తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 30 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో దేవాలయ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రమాదేవి హెచ్చరించారు. ఈ మేరకు కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావ్ విజ్ఞప్తిమేరకు డివిజన్ పరిధిలోని శ్రీరామకాలనీ, భగాయత్, శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రమాదేవితోపాటు, తహసీల్దార్ సునీత, అసిస్టెంట్ కమిషనర్ బి.కృష్ణ, మల్లికార్జునస్వామి దేవాలయం కార్యనిర్వహణ అధికారి నరేందర్, అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు తదితరులతో కలిసి కార్పొరేటర్ శ్రీవాణి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ రామంతాపూర్‌లో దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవాదాయశాఖభూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయం పక్కనే ఉన్న గ్రామ కంఠం స్థలం పార్కింగ్ కోసం ఉపయోగిస్తామని, ఇందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులకు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఆలయం సమీపంలో ఉన్న భూమికి బదులుగా మరో చోట స్థలం ఇచ్చే విషయం పరిశీలిస్తామన్నారు. శ్రీరామకాలనీలో సర్వేనెం.91/1, 91/2లోని సుమారు 33 గుంటల స్థలంలో ఆరు గుంటల స్థలం ఆక్రమణకు గురైందని, భగాయత్ పరిధిలోని సర్వేనెం.1లో ఉన్న ఒక ఎకరా 12 గుంటల స్థలంలో కొన్ని ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, నాయకులు సంకూరి కుమారస్వామి, కామేశ్వర్‌రావు, వంగాల సంతోష్‌గుప్త, పరిశ్రీనివాస్, శైలేందర్, మామిండ్ల సుధాకర్, పలువురు స్థానికులు, ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## బూత్ కమిటీ సభ్యులతో సమావేశం


సమావేశంలో కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, నవంబర్ 30 ప్రభాతవార్త:** ఓటరు నమోదు కార్యక్రమంపై బుధవారం నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి బూత్ కమిటీసభ్యులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌పరిధిలో నిర్వహించే ఓటరు నమోదు కేంద్రంలో బూత్ కమిటీ సభ్యులు ప్రాతినిధ్యం వహించి నమోదు కేంద్రాన్ని నిర్వహించాలన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులతో కలసి ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18సంలు నిండిన ప్రతిఒక్కరు ఓటరు కార్డులో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ అధ్యక్షులు పిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, నాయకులు మాయత్య, గోకుల్, జయరాం, చెన్నారెడ్డి, శివ, గోపి, మహేష్, రాజు, కిశోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధి: కార్పొరేటర్ శ్వేత


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, నవంబరు 30 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్‌డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిచేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలో రూ.44లక్షల వ్యయంతో చేపడుతున్న బిటి రోడ్డు పనులను ప్రారంభించినఅనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నాయకులు వీరేంద్రబాబు, రజని, కాలనీవాసులు రవి, ప్రవీణ్‌రెడ్డి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

## డిపిఎస్‌లో ఆకట్టుకున్న అంతరాగిణి



చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న యాజమాన్యం

**నాచారం, నవంబర్ 30 ప్రభాతవార్త :** డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులతో నిర్వహించిన అంతరాగిణి కార్యక్రమం సందడిగా సాగింది. అంతర్ పాఠశాల సాంస్కృతిక, సాహిత్య పోటీలల్లో ఒకటైన అంతరాగిణి కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. జంటనగరాలల్లోని వివిద పాఠశాలలనుంచి సుమారు 300 మంది చిన్నారులు వచ్చి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నందితా సుంకర విద్యార్థులతో వివిద సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎంతో ప్రోత్సహించారు. ముఖ్య అతిథులుగా కథకుల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు మేఘన బొమ్మతనహళ్లి, కథకుల సంఘం కమిటీ సభ్యురాలు క్షమతా చేవూరి హాజరై తమ కథాపఠనాలతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రత్యేకతలు ఇలాంటి ఈవెంట్స్‌ల ద్వార బయటకు తీసుకురావడానికి దోహదపడుతాయన్నారు. శ్రావ్యమైన సోలో సాంగ్, డ్యాన్స్, కళ, కథలు క్లే మోడలింగ్ వంటి ఈవెంట్స్‌ను చిన్నారులు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఐ.సుధతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సాయి హోమ్స్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక...

**తుర్కయంజాల్, నవంబర్ 30 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీ సాయి హోమ్స్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. సాయి హోమ్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపికకు ఎన్నికల నిర్వహణాధికారులుగా ఆర్.తిరుపతి, సిహెచ్ చంద్రమౌళి వ్యవహరించారు. నూతనఅధ్యక్షులుగా జి.రాము, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా ఆర్.కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా ఇ.కనకయ్య, లీగల్ అడ్వైజర్ ఎం నరేష్, కోశాధికారి సిహెచ్ రాజేశ్వర్, జెయింట్ సెక్రెటరీ కే శాంతి, హెల్పర్ సెక్రెటరీ డి మహేందర్, మహిళల సెక్రెటరీ తనుజ, కార్యవర్గసభ్యులు సిహెచ్.సోములు, బి బాల్రాజ్, కే మురళి కృష్ణ, రమేష్ సన్నిధిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాము మాట్లాడుతూ శ్రీ సాయి హోమ్స్ కాలనీ అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు కాలిని సబ్యులందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ కాలనీ అభివృద్ధి కృషి చేస్తానని, కాలనీ వాసులందరూ సహకరించాలని కోరారు.

## తెలంగాణ రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ పోరుబాట: రామ్‌రెడ్డి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త :** ధరణి పోర్టల్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ధరణిపోర్టల్ వల్ల రైతు భీమా, రైతుబంధు పథకాలలో కూడా అన్యాయం జరుగుతుందని ఎల్బీనగర్ నియోజకవర్గ్ కాంగ్రెస్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణిపోర్టల్, రుణ మాఫీ, రైతుభీమా, రైతుబంధు, పోడుభూముల బాధితుల సమస్యలపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం ఎల్బీనగర్ రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పించి నిరాహారదీక్షలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణిపోర్టల్ యొక్క సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. పోడుభూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, సంకేపల్లి సుధీర్‌రెడ్డి, సుజాతరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మకుటం సదాశివుడు, కుట్ల నరసింహయాదవ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, రాజశేఖర్, మంజులారెడ్డి, సౌమ్యరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ : శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాంత్‌రెడ్డికి ఆర్డర్ పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా పరిధిలోని జర్నలిస్టు పిల్లలకు విద్యాసంస్థల్లో 50% ఫీజు రాయితీ ఇచ్చేవిధంగా డిఇఓ ఆదేశాలు జారీ చేశారని రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. జిల్లాలో జర్నలిస్టుపిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో రాయితీ ఇచ్చే విధంగా చొరవ తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించి డిఇఓకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డిఇఓ రంగారెడ్డి జిల్లా పరిధిలోని జర్నలిస్టు పిల్ల ల చదువుల నిమిత్తం 50% ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ఆర్డర్ కాపీను జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల అభ్యున్నతి కోసం మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ సహకరించడంపట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టియుడబ్ల్యూజే నిరంతరం పోరాటం చేస్తుందని వారు పేర్కొన్నారు.

## కేంద్రం బీసీల కులగణన చేపట్టి రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

**తుర్కయంజాల్, నవంబర్ 30 ప్రభాతవార్త :** బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ బిఎస్‌పి ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపాలిటీ అధ్యక్షులు వదిగళ్ళ బాబు మాట్లాడుతూ అగ్రవర్ణలలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్ కేటాయించడంద్వారా రిజర్వేషన్లు 50%కి మించకుడదనే నిబంధనను మీరిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే 27%శాతం మాత్రమే రిజర్వేషన్ల హక్కులు కల్గిన 52%శాతం వున్న బీసీ వెనక బడిన తరగతులకు తక్షణమే 50%రిజర్వేషన్లను, అదే విధంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పెరిగిన జనాభా ధమషా ప్రకారంరిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే కుల గణన చేపట్టి, బీసీల రిజర్వేషన్ పెంచక పోతే బీఎస్పీ పార్టీ అధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మేతరి కుమార్, డాక్టర్ యడవల్లి శ్యామ్, పట్నం రమేష్‌కురుమ, జాంతుక సైదులు, రాజు, నేనావత్ మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక ధర పలికిన బ్యాడిగి మిర్చి : వంజరి ప్రవీణ్‌కుమార్

**మలక్‌పేట, నవంబర్ 30 ప్రభాతవార్త :** మలక్‌పేట మార్కెట్‌లో బ్యాడిగి మిర్చి అత్యధిక ధర పలికింది. గదాల్‌జిల్లా కాకులారం గ్రామానికి చెందిన యువ రైతు గజేందర్ పండించిన 2043 శ్రీ జెట్ట బాద్యగిగి మీడియం రకం మిర్చి 4 క్వింటాళ్లు మార్కెట్‌లో విక్రయించడానికి తీసుకురావడం జరిగింది. మార్కెట్‌కు చెందిన శివకృష్ణ ట్రేడర్స్ నిర్వాహకులు వంజరి ప్రవీణ్‌కుమార్ మిర్చిని కొనుగోలు చేయగా క్వింటాల్ 30వేల చొప్పున కొనుగోలు చేసామని ఈ మిర్చికి మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రైతు గజేందర్‌ను అభినందించారు.